

13 నుంచి సేవాలాల్ ఉత్సవాలు

బంజారాల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు మంగళవారం నుంచి సేవాగఢ్‌లో ప్రారంభం కానున్నాయి.

8లో



టమాట కిలో రూ.16

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

36.7°/ 14.8°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి వాతావరణం కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా స్థాయి 'స్పందన' కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతో పాటు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం, ధర్మవరం, కదిరి ఆర్డీఓ కార్యాలయాలు, మండల స్థాయిలోనూ ఉదయం 10 గంటలకు 'స్పందన' ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు అందించే అర్జీలలో ఆధార్, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పొందుపరచాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తప్పక విచ్చేయాలన్నారు.

పలు రైళ్ల పునరుద్ధరణ



అనంతపురం సిటీ: గతంలో వివిధ కారణాలతో రద్దు చేసిన పలు రైళ్లను పునరుద్ధరించినట్లు అనంతపురం రైల్వేస్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. కుర్లా–కోయబంత్తూరు–కుర్లా మధ్య తిరిగే కుర్లా ఎక్స్‌ప్రెస్ రైళ్ల(నంబర్: 1013/1014) తిరిగి పునరుద్ధరించినట్లు వివరించారు. యశ్వంత్‌పుర–సికింద్రాబాద్–యశ్వంత్‌పుర మధ్య నడిచే గరీబ్‌రథ్ రైళ్ల(నంబర్: 12736/12735) కూడా యథాతథంగా రాకపోకలు సాగిస్తాయన్నారు. మచిలీపట్నం–యశ్వంత్‌పుర–మచిలీపట్నం మధ్య తిరిగే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలును కూడా పునఃప్రారంభించినట్లు స్టేషన్ మేనేజర్ అశోక్ తెలిపారు. హౌరా–ప్రశాంతినిలయం–హౌరా మధ్య నడిచే రైళ్ల (నంబర్: 22831/22832) కూడా పున రుద్ధరించారు. గుంతకల్లు రైల్వే జంక్షన్ నుంచి శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం వరకు రాకపోకలు సాగించే డెమో ప్యాసింజర్ రైళ్ల నెంబర్: 22831/22832 ను ఆదివారం నుంచి రాకపోకలు ప్రారంభించినట్లు మేనేజర్ తెలిపారు. ప్రయాణికులు, ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చిక్కబళ్లాపురంలో మహిళ హత్య

- ఐదు రోజుల తర్వాత వెలుగులోకి



హతురాలు దీప

చిక్కబళ్లాపురం: కర్ణాటక రాష్ట్రం చిక్కబళ్లాపురంలోని చామరాజపేట సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ సమీపాన ఓ ఇంట్లో మహిళ హత్యకు గురైంది. ఐదు రోజుల తర్వాత ఈ ఘటన వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. కాన్వెంట్ సమీపాన గల ఇంటిలో దీప (40), మల్లికార్జున్ అలియాస్ దివాకర్ జంట గత జనవరి నెలలో అద్దెకు దిగారు. తాము భార్యాభర్తలమని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీసత్యసాయి జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన వారిగా ఇంటి యజమాని వద్ద చెప్పారు. దీప ఇంటిపట్టున ఉండగా.. మల్లికార్జున ఒక షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఏమైందో తెలియదు గానీ ఈ నెల ఏడో తేదీ నుంచి ఇంటి తలుపులు తీయలేదు. ఆదివారం ఉదయం ఇంటిలోంచి దుర్వాసన వస్తుండటంతో ఇంటి యజమాని, స్థానికులు కిటికీలో నుంచి చూడగా దీప అచేతనావస్థలో శవంగా కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి లోనికెళ్లి చూడగా దీప గొంతును కత్తితో కోసినట్లుగా గుర్తించారు. మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఎస్పీ నాగేష్, డీఎస్పీ శివకుమార్, సీఐ మంజునాథ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీప భర్తగా చెప్పుకునే మల్లికార్జున కనిపించడం లేదు. అతనే ఆమెను హత్య చేసి పరారయ్యాడా.. లేక ఇంకేమైనా జరిగిందా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అభాగ్యులకు భరోసా

పేదల సంక్షేమం – ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోంది. అంతేకాదు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, మంచానికే పరిమితమైన వారిని ఆదుకునేందుకు పింఛన్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోంది. గత టీడీపీ హయాంలో చాలా తక్కువ మొత్తంలో ఉన్న పింఛన్లను జగన్ సర్కారు వ్యాధి తీవ్రతను బట్టి రూ.5వేల నుంచి రూ.10 వేలదాకా పెంచింది. వారి జీవితాల్లో సంతోషాలు నింపింది.



అనంతపురం ఆస్పత్రిలో చెర్లోపల్లికి చెందిన బాబాఫక్రుద్దీన్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ గౌతమి

- ఆదుకుంటున్న వైఎస్సార్ పెన్షన్ కానుక
- 9 రకాల వ్యాధిగ్రస్తులకు పింఛన్లు
- వ్యాధి తీవ్రతను బట్టి రూ.5 వేల నుంచి రూ.10 వేలు
- జిల్లాలో 2,392 మంది లబ్ధిదారులు

జిల్లాలో 11 రకాల పింఛన్ వివరాలు

వ్యాధి	లబ్ధిదారులు
పెరాలసిస్	782
తలసేమియా	236
సికిల్‌సెల్	248
హిమోఫిలియా	90
ప్రమాద బాధితులు	460
కిడ్నీ, లివర్, గుండె మార్పిడి	222
కుష్టు	146
బోదకాలు	38
సీరమ్ క్రియాటినిన్	170
మొత్తం	2,392

పుట్టపర్తి అర్బన్: పేద కుటుంబాల్లో దీర్ఘకాలిక రోగులు ఉంటే ఆర్థికభారం పెరిగిపోతుంది. సంపాదన కుటుంబ పోషణకే చాలని పరిస్థితుల్లో దీర్ఘకాలిక రోగుల బాగోగులు చూసుకోవడం కష్టతరమవుతుంది. అలాంటి అభాగ్యులకు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ముంగిటకే వైద్య సేవలు తీసుకొచ్చింది. నిర్దేశిత తేదీల్లో శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేసి.. అవసరమైన మందులు అందిస్తోంది. అంతేకాదు దీర్ఘకాలిక వ్యాధులబారిన పడిన వారికి 'వైఎస్సార్ పెన్షన్ కానుక' అందిస్తోంది. ఈ పథకంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తరఫున దీర్ఘకాలిక రోగులు, అచేతనావస్థలో ఉన్న 2,392 మంది లబ్ధిదారులు పింఛన్లు అందుకుంటున్నారు.

ఎవరికి ఎంత పింఛన్ అంటే..

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిఫార్సు చేసిన తలసీమియా, సికిల్ సెల్, సివియర్ హీమోఫీలియా వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా రూ.10 వేలు అందజేస్తున్నారు. వీటితో పాటు కిడ్నీ, లివర్, గుండె రీప్లేస్‌మెంట్ రోగులకు, కండరాల క్షీణత, ప్రమాదాలతో మంచానికి, వీల్‌చైర్‌కు పరిమితమైన వారికి, రెండు కాళ్లు బోదకాలు ఉన్న వారికి నెలకు రూ.5వేల పింఛన్ ఇస్తున్నారు. ఇక కుష్టు వ్యాధిగ్రస్తులకు రూ.3 వేల పింఛన్ వర్తింపజేస్తున్నారు. మొత్తం 11 రోగగ్రస్తులకు వైద్య ఆరోగ్య శాఖ సిఫార్సుల మేరకు పింఛన్ అందజేస్తున్నట్లు డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పెన్షన్లకు ప్రతి నెలా రూ.1.35 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు.

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

11 రకాలకు సంబంధించిన రోగులు సంబంధిత వార్డు/ గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా మెడికల్ బోర్డులోని కమిటీ రోగ నిర్ధారణ చేస్తుంది. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు వ్యాధి నిర్ధారణ చేసి ధ్రువీకరణ పత్రాన్ని రోగులకు అందజేస్తారు. దీనికి ఆధార్, బియ్యం కార్డు, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్‌లను జతచేసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) కార్యాలయంలోని 'పెన్షన్' విభాగంలో అందజేస్తారు. ఈ దరఖాస్తులను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు అప్‌లోడ్ చేస్తారు. అక్కడి నుంచి పింఛన్ మంజూరు పత్రాలు సచివాలయాలకు చేరుతాయి. వీటి ప్రకారం వలంటీర్లు పింఛన్ మొత్తాన్ని ప్రతి నెలా ఠంచన్‌గా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారు.

పింఛనే జీవనాధారం



పెరాలసిస్‌తో నాకు కాళ్లు, చేతులు చచ్చుపడిపోయాయి. సంపాదించే వయసులో ఈ వ్యాధి సోకింది. కుటుంబ పోషణ భారమైంది. ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని అక్కడి నుంచి పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు నన్ను అర్హునిగా గుర్తించి రూ.5 వేలు పింఛన్ అందేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు పింఛన్ డబ్బే నాకు జీవనాధారమైంది. వలంటీర్ ఇంటికి వచ్చి అందజేస్తున్నాడు. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు.

– వీరేష్, పెదపల్లి, పుట్టపర్తి మండలం

సీఎం మేలును మరువలేం



నేను 2021 నుంచి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నా. వైద్యాధికారులు నాకు 'వైఎస్సార్ పెన్షన్ కానుక' కింద పింఛన్ కోసం సిఫార్సు చేశారు. రూ.10 వేలు పింఛన్ మంజూరైంది. పింఛన్ అందజేసే సమయంలో వైద్యం కోసం ఏ ఆస్పత్రిలో ఉన్నా వలంటీర్ అక్కడికే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. హైదరాబాద్ ఆస్పత్రికి వచ్చి పింఛన్ అందజేసిన సందర్భాలూ ఉన్నాయి. ఇంత మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను మరిచిపోలేము.

– ఓబిరెడ్డి, చెర్లోపల్లి, పుట్టపర్తి మండలం

చాలా మంచి పథకం



వైఎస్సార్ పెన్షన్ కానుక చాలా మంచి పథకం. ఎంతో మంది అభాగ్యులు ఆర్థిక చేయూత పొందుతున్నారు. దీర్ఘకాలిక అనారోగ్యం, నడవలేని వారు, నిత్యం వైద్యం కోసం పట్టణాలకు వెళ్లాలన్నా ఎన్నో ఇబ్బందులకు గురవుతుంటారు. నిజమైన రోగులందరికీ వైద్య ఆరోగ్య శాఖ తరఫున పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా అవకతవకలు జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకుంటున్నాం.

– నరసయ్య, డీఆర్‌డీఏ పీడీ

'సూపర్ స్పెషాలిటీ'లో అధునాతన శస్త్రచికిత్సలు



హాజరైన ప్రముఖ న్యూరో సర్జన్‌లు, ఆర్థోపెడీషియన్లతో ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన పరికరాలతో శస్త్రచికిత్సలు చేస్తున్నట్లు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో న్యూరో సర్జరీ, ఆర్థోపెడిక్స్, బెంగళూరు ఎస్టర్ సీఎంఐ ఆస్పత్రి సహకారంతో 'మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీ (చిన్నగాటుతో ట్యూబ్ పంపి మైక్రో స్కోప్ ద్వారా సర్జరీ)'పై నిరంతర వైద్య సదస్సు (సీఎంఈ) జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక నుంచి 150 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లతో పాటు ప్రముఖ సీనియర్ న్యూరోసర్జన్ డాక్టర్ డబ్ల్యూ సీతారాం, సూపర్ స్పెషాలిటీ న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్, స్పైన్ సర్జరీల్లో నూతన ఆవిష్కరణలను తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ మాట్లాడుతూ వైద్య కళాశాల ఏర్పాటైన 24 ఏళ్లలో తొలిసారిగా న్యూరో సీఎంఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి సదస్సుల ద్వారా నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుందన్నారు. ప్రముఖ సీనియర్ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారం మాట్లాడుతూ అధునాత సర్జరీలు సూపర్ స్పెషాలిటీలో నిర్వహించడం అభినందనీయమన్నారు. న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ మాట్లాడుతూ మినిమల్లీ ఇన్వేసివ్ స్పైన్ సర్జరీలను ప్రైవేట్‌గా చేయించుకోవాలంటే రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అలాంటిది సూపర్ స్పెషాలిటీలో ఉచితంగా చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 470 మేజర్, 450 మైనర్ సర్జరీలను విజయవంతంగా చేశామన్నారు. 20,000 మందికి ఓపీ సేవలు అందించామన్నారు. ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఉమేష్ శ్రీకాంత వర్క్‌షాప్ క్లినికల్ ముఖ్యాంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం నగరంలోని ఓ ప్రముఖ హోటల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేసి హాజరైన ప్రతినిధులను సన్మానించారు. సదస్సులో పరిశీలకులుగా రాష్ట్ర వైద్య మండలి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ ఎస్వీకే ప్రసాదరెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రమణ్యం, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ సుభాష్ చంద్రబోస్, న్యూరో సర్జన్ డాక్టర్ రవితేజ, ఆర్థో హెచ్‌ఓడీ ఆత్మారాం, ఆర్థో వైద్యులు డాక్టర్ సత్తీష్, డాక్టర్ శాంతిస్వరూప్, డాక్టర్ గౌస్, ఆస్టర్ సీఎంఐ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్‌జీఎస్ లక్ష్మణన్, తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా 'సిద్ధం'

- ఇప్పటికే ప్రతిపక్షాల వెన్నులో వణుకు
- రాయలసీమలో ప్రభంజనం సృష్టిస్తాం
- త్వరలో పొత్తుల పార్టీల పరారు
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం టవర్‌క్లాక్: రాప్తాడులోని ఆటోనగర్ వద్ద ఈ నెల 18న నిర్వహించనున్న 'సిద్ధం' సభ చరిత్రలో నిలవనుందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే భీమిలి, దెందులూరులో నిర్వహించిన 'సిద్ధం' సభలకు వచ్చిన స్పందన చూసి ప్రతిపక్షాల వెన్నులో వణుకు మొదలైందన్నారు. ఆ రెండు సభల కంటే మిన్నగా రాప్తాడులో సీఎం సభ జరగనుందన్నారు. రాయలసీమ వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు 10 లక్షల మందికి పైగా తరలిరానున్నారన్నారు. టీడీపీ హయాంలో హత్యా రాజకీయాలకు కేరాఫ్ అడ్రెస్‌గా ఉన్న రాయలసీమను అభివృద్ధికి అడ్డాగా మార్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ఆయన తీసుకున్న చర్యలతో నేడు రాయలసీమ పవర్ జంక్షన్‌గా, వాటర్ బ్యాంక్‌గా, ఇండస్ట్రీల హబ్‌గా మారిందని కొనియాడారు. 124 సార్లు కంప్యూటర్ బటన్ నొక్కి నిరుపేదలకు చేయూతనందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్లు సంక్షేమ ఫలాలను ఇళ్లముంగిటకే చేర్చారన్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో 'ఫ్యాను గుర్తు'కు ఓటేసి సంక్షేమ సారథికి అండగా నిలవాలని కోరారు.

త్వరలో పొత్తుల పార్టీల కనుమరుగు..

జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో 'సిద్ధం' సభకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగం కోసం ప్రజలు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. 'సిద్ధం సభకు నేను వెళుతున్నా.. మీరు వస్తున్నారా?' అని గ్రామాల్లో ప్రతి కార్యకర్త పిలువునిస్తున్నారన్నారు. పింఛన్ తీసుకుంటున్న అవ్వా తాతలు తామే జగన్ మోహన్‌రెడ్డి సైనికులమంటున్నారు. 'ఆసరా', 'చేయూత' పథకాలతో లబ్ధి పొందిన అక్కచెల్లెమ్మలు మళ్లీ జగనన్నకే మా మద్దతు అంటున్నారని గుర్తు చేశారు. 'రైతు భరోసా', 'ఉచిత విద్యుత్' పథకాలతో లబ్ధి పొందిన రైతన్నలు వైఎస్సార్ సీపీ జెండా పట్టుకుని రాప్తాడుకు కదలి రానున్నారన్నారు. రాప్తాడు సభలో పార్టీ శ్రేణులు చేసే జయజయధ్వానాలు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగనున్నాయన్నారు. ఈ సభ తర్వాత పొత్తుల పార్టీలు పరారవడం ఖాయమన్నారు. రాయలసీమలో మళ్లీ తమ పార్టీ ప్రభంజనం సృష్టించనుందన్నారు. ఈ సారి అన్ని స్థానాలనూ కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కనీసం పంచాయతీ ఎన్నికల్లో కూడా గెలవని నారా లోకేష్ మాటలు పట్టించుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ చంద్ర, ఉప్పరపల్లి శ్రీనివాసులు, రాప్తాడు మండల పార్టీ కన్వీనర్ జూటూరు శేఖర్, ధనుంజయ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

అనంతపురం అగ్రికల్చర్: వేసవి ప్రారంభం కాక మునుపే సూరీడు సుర్రుమంటున్నాడు. వారం రోజులుగా మధ్యాహ్నం వేసవి సెగ కనిపిస్తోంది. ఈ నెల రెండో వారం నుంచి పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. అంతకు మునుపు పగలు 30 నుంచి 33 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. 4 రోజులుగా చాలా మండలాల్లో 35 డిగ్రీలకు పైగా నమోదవుతున్నాయి. తాడిపత్రి, యాడికి, శింగనమల, పామిడి, పుట్లూరు మండలాల్లో 36 నుంచి 38 డిగ్రీలకు చేరుకుంటున్న పరిస్థితి. అయితే శెట్టూరు, కుందుర్పి, కంబదూరు, గుమ్మగట్ట, రాయదుర్గం, కూడేరు తదితర కొన్ని మండలాల్లో వేకువజామున 15 నుంచి 17 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మిగతా మండలాల్లో 18 నుంచి 20 డిగ్రీలకు ఎగబాకాయి. ఈ క్రమంలో మార్చి, ఏప్రిల్, మే పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. శ్రీ సత్యసాయి జిల్లాలో కూడా చాలా మండలాల్లో పగలు ఎండ, ఉదయం చలి వాతావరణం కొనసాగుతోంది.

జగన్ వెంటే చేనేత



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి చేరిన చేనేత ప్రముఖుడు బుడగల శంకర్, చేనేత కుటుంబాల వారు



బుడగల శంకర్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న చేనేత కార్మికులు

- వైఎస్సార్‌సీపీలో చేరిన చేనేత ప్రముఖుడు బుడగల శంకర్
- ఆయనతో పాటు 300మంది చేనేత కుటుంబాల వారు సైతం
- సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని చేనేత కార్మికులు వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మద్దతు తెలిపి అభిమానం చాటుకుంటున్నారు. సీఎం జగన్ వెంటే తామంతా నడుస్తామని నినదించారు. చేనేత ప్రముఖుడు బుడగల శంకర్ తన అనుచరులు, 300 చేనేత కార్మిక కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆదివారం ఎస్బీఐ కాలనీలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వీరందరికీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అంతకుముందు బుడగల శంకర్ తన అనుచరులు, కార్మికులతో కలసి పట్టణంలో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. పార్టీలోకి చేరిన వారిలో చాక్లెట్ సూరి, బ్యాళ్ల పార్థ, పల్లా శేఖర్, జింకా బాబు, గొడ్డుమర్రి మురళి, పోతులయ్య, చెన్నా లక్ష్మీనారాయణ, ఓబిలేసు, నిమ్మల మోహన్, భాస్కర్, శీలా నారాయణ, మధుసూదన్ నాయుడు, రాఘవేంద్ర, భరత్, రాము, నిమ్మల మోహన్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా బుడగల శంకర్ మాట్లాడుతూ ధర్మవరం నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే కేతిరెడ్డి అభివృద్ధి బాటలో పయనింపజేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేతలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు పరిశ్రమ అభివృద్ధికి ఎంతో తోడ్పాటునందిస్తున్నాయన్నారు. అందుకే రాజకీయాలకు దూరంగా ఉండే తాము వైఎస్సార్‌సీపీలోకి చేరామన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ చేనేత పరిశ్రమ గత టీడీపీ పాలనలో నిర్వీర్యమైందన్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి తోడ్పాటూ లేక ఎంతో మంది కార్మికులు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నారని, వారిలో ఏ ఒక్కరికీ పరిహారం కూడా అందించలేకపోయారని అన్నారు. అప్పటి సీఎం చంద్రబాబు వైఖరికి నిరసనగా భిక్షాటన చేసి చేనేత కార్మికులకు రూ.25లక్షల సాయం అందించామని గుర్తు చేశారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రాగానే టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఆర్థికసాయం అందించామని వెల్లడించారు.

జగనన్నతోనే చేనేతకు పూర్వ వైభవం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే చేనేత పరిశ్రమకు పూర్వవైభవం లభిస్తుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి తెలిపారు. నేతన్న నేస్తం పథకం ద్వారా ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల ఆర్థిక సాయాన్ని ఐదేళ్ల పాటు క్రమం తప్పకుండా అందించారన్నారు. ఈ సాయం ద్వారా చేనేతలు మగ్గాన్ని ఆధునీకరించి మెరుగైన సంపాదన పొందుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రప్రథమంగా చేనేతలకు 1.50 సెంట్ల స్థలాన్ని పట్టణానికి అతి చేరువలో ఇచ్చినట్లు చెప్పారు. ఇళ్లు, మగ్గంషెడ్ నిర్మించుకునేందుకు ప్రభుత్వం సాయం అందించిందన్నారు. తాను రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో 24వేల మంది నిరుపేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేశామని చెప్పారు. జగన్ అధికారంలోకి వస్తే జనం బాగుపడతారని.. అలాకాకుండా చంద్రబాబును సీఎం చేస్తే ఇద్దరు, ముగ్గురు టీడీపీ కార్యకర్తలు మాత్రమే బాగుపడతారని అన్నారు. రానున్న ఎన్నికల్లో చేనేతలంతా ఏకతాటిపై నిలిచి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, చేనేత నాయకులు దాసెట్టి నాగరాజు, నీలూరి ప్రకాష్, కాచర్ల అంజి, సిద్ది రాజేష్, ఉడుముల రాము, జింకా కంబగిరి, జింకా రెడ్డప్ప, గోలి నాగభూషణ, నాయకులు, కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, చాంద్‌బాషా, బడన్నపల్లి కేశవరెడ్డి, కోటిరెడ్డి బాలిరెడ్డి, శంకర తేజ, కడప రంగస్వామి, ఎస్పీ బాషా, గోరకాటి పురుషోత్తంరెడ్డి, బహ్మా, కేతా లోకేష్, గడ్డం రంగ, చెలిమి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.



నృత్యరూపకంలోని ఒక ఘట్టం

అలరించిన 'సాయి అనుగ్రహం'

ప్రశాంతి నిలయం: సత్యసాయి దివ్య బోధనలు మానవాళిని సన్మార్గంలో నడుపుతున్న తీరును వివరిస్తూ సాగిన 'సాయి అనుగ్రహం' నృత్యరూపకం భక్తులను అలరించింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా సత్యసాయి భక్తులు ఆదివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత 'సాయి అనుగ్రహం' పేరుతో సంగీనృత్య రూపకం ప్రదర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు సత్యసాయి బోధనలు ఆచరించడం ద్వారా ఏ విధంగా పరిష్కారం అవుతున్నాయో.. మనుషుల మధ్య తారతమ్యాలు, భేదాభిప్రాయాలు తొలగుతున్న తీరును చక్కగా వివరించారు. అనంతరం భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య


కొండారెడ్డి (ఫైల్)

గాండ్లపెంట: మండలంలోని ఎలుగూటివారిపల్లిలో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన నూలిటి కొండారెడ్డి(76) భార్య రామక్క అనారోగ్యంతో గతేడాది మృతి చెందింది. అప్పటి నుంచి ఆయన మానసిక కుంగుబాటుకు గురయ్యాడు. ఈక్రమంలో ఈ నెల 9 సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి గ్రామ పరిసర పొలాల్లో వెదికేందుకు వెళ్లగా చౌటకుంట బావి ఒడ్డున దుస్తులు, పాదరక్షలు కనిపించాయి. బావిలో వెదికినా ఆచూకీ లభించలేదు. అయితే ఆదివారం ఉదయం మృతదేహం బావి నీటిపై తేలియాడుతూ కనిపించింది. పోలీసులు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమార్తె రాజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: నడింపల్లి గేట్ సమీపంలో ఆదివారం రాత్రి బెంగళూరు నుంచి ధర్మవరం వెళ్లే రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి(35) మృతి చెందాడు. మృతుడి వద్ద గౌరిబిదనూరు నుంచి బరంపూర్‌కు జనరల్ బోగీలో ప్రయాణించే టికెటు లభించినట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. రైలులో ప్రయాణిస్తూ కింద పడినట్లు తెలుస్తోందని, తూమకుంట లేదా కర్ణాటక సరిహద్దు కర్మాగారాల్లో పనిచేసే కార్మికుడిగా అనుమానిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వివరించారు.

రేషన్ బియ్యం పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 150 బస్తాల రేషన్ బియ్యాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు తెలిపిన వివరాలు.. గ్రామాల్లో రేషన్ దుకాణాల నుంచి కార్డుదారులు తెచ్చుకున్న బియ్యంను కిలో రూ.20 చొప్పున కొనుగోలు చేసి 150 బస్తాలలో నింపి తొండపాడు గ్రామంలో ఓ ఇంట్లో ఉంచారు. పక్కా సమాచారంతో సీఐ వెంకట్రామిరెడ్డి, సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. గ్రామంలోని రహస్య ప్రదేశంలో బియ్యం నిల్వ ఉంచినట్లు గుర్తించారు. 150 బస్తాలను స్వాధీనం చేసుకొని గుత్తి ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్‌కు తరలించారు. బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న మండలంలోని కరిడికొండ గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై రెవెన్యూ చట్టం ప్రకారం 6ఏ, క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్

- నాడు కొండ గుట్టల ప్రాంతం.. నేడు పుణ్యక్షేత్రం
- భారతదేశంలోనే ఏకైక ఆలయం
- రేపటి నుంచి జయంత్యుత్సవాలు



సంత్ సేవాలాల్ మహరాజ్ మూలవిరాట్, సేవాలాల్ మహరాజ్ ఆలయం


భీమానాయక్ కట్ట

గుత్తి రూరల్: చెర్లోపల్లి గ్రామ పంచాయతీలోని సేవాగఢ్‌లో కొలువైన సంత్ సేవాలాల్ మహరాజ్ దేశవ్యాప్తంగా ఉన్న బంజారాల ఆరాధ్యదైవంగా పూజలందుకుంటున్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ సేవాగఢ్‌లో 285 ఏళ్ల క్రితం జన్మించినట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఈ నెల 13 నుంచి ఈ నెల 15 వరకూ ఘనంగా జయంత్యుత్సవాలు జరగనున్నాయి. 14న రాత్రి జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. సేవాగఢ్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వేలసంఖ్యలో తరలివస్తుంటారు.

సేవాగఢ్ విశిష్టత..

గుత్తి మండలం చెర్లోపల్లి గ్రామ సమీపంలో సేవాలాల్ మహరాజ్ జన్మించినట్లు చెబుతారు. 25 సంవత్సరాల క్రితం వరకూ ఈ స్థలం నిర్జీవమైన కొండ గుట్టల ప్రాంతం. పెద్ద బండరాళ్లతో నిండిన అడవిలాంటి ప్రదేశం. నేడు ఒక పవిత్రస్థలంగా మారింది. గుత్తికి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న చెర్లోపల్లి వద్ద రాంజినాయక్ తండాలో గిరిజనులుండేవారు. వారు ప్రసాదానికి అవసరమైన పాడిని అందించేవారని, ఆ తండా పెద్ద దిక్కుగా సేవాలాల్ తండ్రి భీమానాయక్ ఉండేవారు. భీమానాయక్‌కు ధర్మణీబాయితో వివాహమై 12 సంవత్సరాల తర్వాత 1739 ఫిబ్రవరి 15న మొదటి సంతానంగా సేవాలాల్‌భాయ్ రాంజినాయక్ తండాలో జన్మించారు. తండ్రి భీమానాయక్ ఆ తండాకు పెద్ద దిక్కుగా ఉంటూ గిరిజనుల సమస్యలను పరిష్కరించడానికి నడుం బిగించారు. గ్రామంలో రచ్చబండపై పంచాయితీలు నిర్వహించి తీర్పులు చెప్పేవారని చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఆ కట్టనే నేడు భీమానాయక్ కట్టగా పిలవబడుతోంది. ఆ కట్టకు ఎదురుగా ఉన్న బావిలో అక్కమ్మ గార్లు స్నానం చేయడంతో బావిని పవిత్ర ''కాశీకుండ్''గా పిలుస్తున్నారు. ఈ కాశీకుండ్ దగ్గరలో దండం మోరో మాత (మారెమ్మ దేవత) గుడి ఉంది. కాలక్రమంలో పెరిగి పెద్దవాడైన సేవాలాల్ భాయ్ దేశ సంచారం చేసి వెళ్లిన ప్రతి చోట అనేక మహిమలు చూపి ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునేవారు. ఆలయం సమీపంలో గల కాశీకుండ్ బావిలో సేవాలాల్ మహరాజ్ అప్పట్లో పుణ్యస్నానం ఆచరించినట్లు బంజారాల విశ్వాసం. అక్కడ స్నానం చేసిన అనంతరం భీమానాయక్ కట్టపై ఆసీనులైన సేవాలాల్ తన బోధనలు చేసినట్లు వారి నమ్మకం. వాటి ఆధారంగా సేవాగఢ్‌లో రూ.కోటి వ్యయంతో అక్కడ ఆలయాన్ని నిర్మించారు. 2000 సంవత్సరంలో మొదటిసారిగా సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. అప్పటి నుంచి ఏటా ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలకు రాష్ట్రం నుంచే కాక దేశంలోని తెలంగాణ, మహరాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, కేరళ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు, గిరిజన ముఖ్యనాయకులు పాల్గొంటారు.

మందిరం ఏర్పాటుకు రంజిత్‌నాయక్ కృషి..

చరిత్ర ఆధారాలతో సేవాగఢ్‌లో సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి బంజారానాయకుడు రంజిత్‌నాయక్ విశేష కృషి చేశారు. ఇక్కడ గుడి నిర్మాణానికి బంజారాలను ఏకం చేసి విరాళాలు సేకరించారు. రంజిత్‌నాయక్ కృషి తోనే నేడు సేవాలాల్ మహరాజ్ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడిగా ఆయన ఆలయాన్ని అభివృద్ధి చేశారు. సేవాగఢ్‌లోని సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ పరిసరాల్లో రూ.1.2 కోట్లతో మారెమ్మ(మాతా జగదాంబ) ఆలయాన్ని నిర్మించారు. ఇవేకాక ఆలయ అభివృద్ధికి ట్రస్ట్ సభ్యులు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఇలా చేరుకోవచ్చు..

సేవాగఢ్‌కు గుత్తి బస్టాండ్ నుంచి నేరుగా బస్సులు ఏర్పాటు చేశారు. రైలులో గుత్తి, గుంతకల్లు స్టేషన్లకు వచ్చిన భక్తులు ఆటోల ద్వారా బస్టాండులకు చేరుకొని ఆర్టీసీ బస్సుల్లో రావాల్సి ఉంటుంది. సొంత వాహనాల్లో వచ్చే వారు గుత్తి–గుంతకల్లు 67వ జాతీయ రహదారిలో గొల్లలదొడ్డి క్రాస్ నుంచి లోపలకు మూడు కిలోమీటర్ల వెళ్తే సేవాలాల్ ఆలయం వస్తుంది.

పుణ్యక్షేత్రానికి వెళ్తే.. ఇంటికి కన్నమేశారు!

- తాళం వేసిన ఇంట్లో చోరీ
- రూ. 20 వేల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలతో పాటు వెండి ఆభరణాల అపహరణ


బీరువాలోని దుస్తులు పడేసిన దృశ్యం

గుత్తి: ఇంటికి తాళం వేసి పుణ్యక్షేత్రానికి వెళ్తే ఆ ఇంటిలో దొంగలుపడి దోచుకెళ్లారు. పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు. ఇండస్ట్రియల్ ఏరియాలో ఉంటున్న విక్రమ్ ఓ ప్రైవేట్ పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేసేవాడు. మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి షిరిడీకి వెళ్లాడు. ఆదివారం తిరిగి ఇంటికొచ్చాడు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా అందులో ఉన్న రూ. 20 వేల నగదు, 5 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు కనిపించలేదు. వెంటనే అతడు పోలీసులకు సమచారాం ఇచ్చారు. సీఐ వెంకటరామిరెడ్డి పోలీసులతో కలిసి విక్రమ్ ఇంటిని పరిశీలించారు. సీసీ కెమెరాను పరిశీలించారు. ఇద్దరు దుండగులు ఇంటిలోకి చొరబడి చోరీ చేసినట్లు సీసీ కెమెరాలో రికార్డు అయింది. అనంతపురం క్లూస్ టీం సభ్యులు చోరీ జరిగి ఇంటిలో వేలి ముద్రలు సేకరించారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు కృషి


సభకు హాజరైన వాల్మీకులు.


వాల్మీకి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ

- వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త బోయ శాంతమ్మ

హిందూపురం: బోయల ఎస్టీ రిజర్వేషన్ సాధనకు కృషి చేస్తానని, సీఎం జగనన్నతోనే ఎస్టీ రిజర్వేషన్ సాధ్యమవుతుందని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బోయ శాంతమ్మ అన్నారు. హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాల్మీకి భవన్ వద్ద వాల్మీకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ గజమాలతో బోయ శాంతమ్మకు ఘన స్వాగతం పలికారు. తర్వాత వారంతా వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో బోయ శాంతమ్మ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బోయలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఇందులో భాగాంగానే మీ ఆడబిడ్డయిన తనను హిందూపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించారన్నారు. అలాగే బోయ ఆడబిడ్డలయిన గిరిజమ్మ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, మంగమ్మకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారని గుర్తు చేశారు. జగనన్న పట్ల నమ్మకాన్ని నిలబెట్టుకునే సమయం వచ్చిందన్నారు. వైఎస్ జగన్‌కు అండగా నిలిచి జరగనున్న ఎన్నికల్లో మంచి మెజర్టీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతోపాటు వాల్మీకి పెద్దలు మాట్లాడుతూ బోయలకు సత్తా చాటుకునే సమయం వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వాల్మీకులంతా ఏకమై వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. బోయల అభ్యున్నతికి సహకారం అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయితే వాల్మీకుల అభ్యున్నతి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంహెచ్ రామాంజి, కౌన్సిలర్ మణి, ముద్దరంగప్ప, సర్పంచ్ ఆదెప్ప, శీను, రిటైర్డ్ ఎస్ఐ లోకేష్, వీఎస్.విజయ్ కుమార్, లక్ష్మీనారాయణ, సునీత, మాజీ సర్పంచ్ కొండూరు శివప్ప, చిరు, మారుతి, సంజీవ, ఆటో శీను, పెద్ద ఎత్తున వాల్మీకులు పాల్గొన్నారు.

జనవాక్కు

మనవడా.. చల్లగా ఉండయ్యా..!



కడుపులో పుట్టిన కన్న కొడుకులు చూసుకోకపోయిన నా మనువడు జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వృద్ధాప్య పెన్షన్ రూ.3వేలు ఇచ్చి నన్ను అన్ని విధాలా ఆదుకొంటున్నాడు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం కార్యక్రమం ద్వారా గ్రామానికి వచ్చి వైద్య పరీక్షలు చేసి బీపీ, షుగర్ దీర్ఘ కాలిక రోగాలకు సైతం మందులు ఉచితంగా ఇస్తున్నారు. ఇలాంటి మనుమడు నిండు నూరేళ్ళు సీఎంగా ఉండాలని కోరుకొంటున్నాను.

– నింగమ్మ, గుడిబండ

అంతా మంచే జరిగింది



సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయాల ద్వారా అంతా మంచే జరుగుతోంది. గతంలో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి వెళ్లేవాళ్లం. ఇప్పుడు అన్నీ పనులూ మా ఊళ్లోనే చక్కబెట్టుకుంటున్నాం. నా కుటుంబానికి అమ్మ ఒడి, విద్యాదీవెన, రైతు భరోసా, చేయూత, పింఛన్ తదితర పథకాల కింద దాదాపు రూ.1.20 లక్షల లబ్ధి చేకూరింది. అన్ని వర్గాలకు మంచి చేస్తున్న సీఎం వైఎస్ జగన్ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నా.

– ఓబుళయ్య, ఎల్లుట్ల, పుట్లూరు మండలం

సొంతింటి కల నెరవేరింది



లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ నా భర్త సంపాదనపై జీవిస్తున్న మాకు కనీసం ఇంటి స్థలం లేక అద్దె ఇంట్లోనే నెటుకొచ్చేవాళ్లం. ఇంటి బాడుగ, కరెంట్ బిల్లు కట్టేందుకు నా భర్త సంపదన సరిపోక నానా ఇబ్బందులు పడ్డాం. సొంతిల్లు కావాలంటూ గత ప్రభుత్వం పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం దక్కలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మాకు ఇంటి స్థలం, పక్కా గృహ నిర్మాణం మంజూరయ్యాయి. ప్రస్తుతం కొత్తింట్లో ఎంతో సంతోషంగా జీవిస్తున్నాం. మా సొంతింటి కలను సాకారం చేసిన సీఎం వైఎస్ జగనన్నకు మేమెంతో రుణపడ్డాం. ఆయనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నాం.

– అనిత, గార్లదిన్నె

పేకాటరాయుళ్ల అరెస్టు

పెద్దపప్పూరు: చింతరపల్లి సమీపంలోని ఓ మామిడితోటలో పేకాట ఆడుతున్న 12 మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. నిందితుల నుంచి పేకముక్కలతో పాటు రూ. 1,04,040 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రోషన్, ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

యాడికిలో..

యాడికి: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.10,120 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

అనంతపురం: అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఏఆర్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న రాజశేఖర్(55) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. మృతుడికి భార్య రాధ, కుమారుడు సాయి పవన్, కుమార్తె కీర్తన ఉన్నారు. ఈయన 1992లో ఏపీఎస్పీ విభాగంలో కానిస్టేబుల్‌గా చేరాడు. 2005లో ఏఆర్ విభాగానికి కన్వర్షన్ అయి జిల్లా ఏఆర్ విభాగంలో పని చేస్తున్నాడు. స్థానిక నందమూరినగర్‌లో రాజశేఖర్ మృతదేహాన్ని ఏఆర్ డీఎస్పీ మునిరాజా, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు స్థానిక పిల్లిగుండ్ల క్వార్టర్స్ సమీపంలో పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థి బలవన్మరణం


సల్మాన్(ఫైల్)

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కొత్తపేటకు చెందిన పదో తరగతి విద్యార్థి ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని కొత్తపేటకు చెందిన నజీర్‌బాషా, తస్లీంబాను దంపతుల రెండో కుమారుడు సల్మాన్(14) ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. సరిగ్గా చదువుకోలేదని తల్లిదండ్రులు మందలించడంతో ఆదివారం రాత్రి ఇంటిలోని ఓ గదిలో ఉరివేసుకున్నాడు. ఇంటిలోకి వచ్చిన సల్మాన్ సోదరుడు బాబా గది తలుపులు తీసి చూడగా సల్మాన్ ఉరి వేసుకుని ఉండటాన్ని గమనించి గట్టిగా కేకలు వేశాడు. దీంతో చుట్టుపక్కలవారు వచ్చి ఉరి వేసుకున్న సల్మాన్‌ను కిందకు దింపారు. అయితే అప్పటికే అతడు మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు.

ఏటీఎంల్లో చోరీకి విఫలయత్నం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో రెండు ఏటీఎంల్లో నగదు చోరీకి విఫలయత్నం జరిగింది. అర్బన్ ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలు.. పట్టణంలోని యల్లనూరు రోడ్డులోని బ్యాంక్ ఆఫ్ బరోడా, సంజీవనగర్ 1వ రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంలను శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు పగులగొట్టి నగదును చోరీ చేసేందుకు ప్రయత్నించారు. అయితే ఏటీఎంలు ఎంతసేపటికీ తెరుచుకోకపోవడంతో చేసేదేమి లేక వెనుదిరిగారు.

ట్రాక్టర్ బోల్తా.. కూలీలకు గాయాలు


చికిత్స పొందుతున్న కాడమ్మ, శివమ్మ

బొమ్మనహాళ్: దర్గాహొన్నూరు గ్రామ శివారులో ఉన్న హెచ్చెల్సీ వంతెన పక్కన ట్రాక్టర్ బోల్తా పడటంతో వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన గుండప్ప పొలంలో మిరప పంట కోత కోసం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మల్లెక్క, శృతి, శశికళ, గంగమ్మ, హెచ్. హనుమక్క, చంద్రమ్మ, కాడమ్మ, శివమ్మలతో పాటు మరో 10 మంది అదే గ్రామానికి చెందిన ఈశ్వరప్ప ట్రాక్టర్‌పై బయలుదేరారు. హెచ్చెల్సీపై ఉన్న వంతెన కూలడంతో కాలువలోనే మార్గాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ట్రాక్టర్ కాలువ గట్టు ఎక్కుతున్న సమయంలో గేర్లు న్యూట్రలై వెనక్కు వస్తూ ట్రాలీ బోల్తా పడింది. ఘటనలో కూలీలు కాడమ్మ, శివమ్మ, చంద్రమ్మకు తీవ్ర గాయాలు కావడంతో బళ్లారి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అక్కడే ఒక్క ఆర్ఎంపీతో ప్రథమ చికిత్స పొందారు. ప్రాణపాయం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా బుటారి నరసింహులు

- 10వ సారి జిల్లాకు అగ్రస్థానం


నరసింహులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన ప్రధానోపాధ్యాయుడు బుటారి నరసింహులును ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో రాష్ట్ర కమిటీని ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా 15 ఏళ్లలో పదోసారి జిల్లా వాసికి అవకాశం రావడం విశేషం. విద్యారంగ అభ్యున్నతి, ఉపాధ్యాయుల సేవలు, సంక్షేమానికి 30 ఏళ్లుగా పోరాటాలు చేస్తూ వివిధ హోదాలు, ఐక్య కార్యాచరణ ఉద్యమాల్లో నరసింహులు సేవలందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 60 వేల మందికి పైగా సభ్యత్వం ఉన్న ఏపీటీఎఫ్‌కు సేవలు అందించడం గర్వంగా ఉందన్నారు. మూడు దశాబ్దాలుగా విద్యాభివృద్ధి, ఉపాధ్యాయుల అభ్యున్నతికి పాటు పడుతున్నామన్నారు. గార్లదిన్నె మండలంలో పనిచేస్తున్న కె. సర్దార్ వలికి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించారు. వీరి ఎన్నిక పట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, పూర్వ ప్రధాన కార్యదర్శి బి హనుమప్ప, ఉపాధ్యక్షులు బొమ్మయ్య, భాస్కర్ జిల్లా కార్యదర్శి నరేష్ కుమార్ ,చెన్నకేశవులు, బాలా రామ మోహన్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కోటిగారి వన్నప్ప తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా వీరకేతమ్మ రథోత్సవం


అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో వీరకేతమ్మ అమ్మవారు

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామ సమీపంలో వెలసిన వీరకేతమ్మ ఆలయం వద్ద అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం వేకువజామున ఆలయంలో అమ్మవారికి అభిషేకం, తోమాలపూజ, హోమం, చండీయాగం, నాగదేవత హోమం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు నృత్యం చేస్తూ మధ్యాహ్నం అమ్మవారి బ్రహ్మరథాన్ని ముందుకు లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు, పూలు, జాకెట్లు అందజేశారు. భక్తులకు అర్చకులు ప్రసాదవినియోగం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

ఉరవకొండ: మండలంలోని బూదగవిలో కుక్కల దాడి చేసిన ఘటనలో గొర్రె పిల్లలు మృతి చెందాయి. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ధనుంజయ ఆదివారం ఉదయం గొర్రె పిల్లలను పాకలో ఉంచి గొర్రెలను మేతకు తోలుకెళ్లాడు. కుక్కల గుంపు పాకలో ఉన్న గొర్రె పిల్లలపై దాడి చేసింది. ఘటనలో 10 గొర్రెపిల్లలు మృతి చెందాయి. ఘటనలో రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.